

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- చింతపల్లి : చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 29న శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ వేణుగోపాల్ తెలిపారు. 33 కెవి చింతపల్లి ఫీడర్‌లో విద్యుత్తు నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలోవిద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

చింతపల్లి ఫీడర్‌లో పాడైన ఇన్సులేటర్లు, జంపర్లు, కనెక్షన్లు, విద్యుత్ లైన్లను తగిలే చెట్లకొమ్మలు తొలగింపు, లోపాలున్న విద్యుత్‌స్తంభాల మార్పు వంటి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. విద్యుత్‌కు అంతరాయంపై చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వినియోగంలో లేక శిథిలావస్థకు..

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనం
- మరమ్మతులు చేస్తే ప్రయోజనం
- అంగన్వాడీకి అప్పగించాలని వినతి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని సంతవలస గ్రామంలోని గుంటసీమ రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భవనం ఉపయోగించక పోవడంతో ప్రస్తుతం ఆ భవనం నిరుపయోగంగా ఉంది. గతంలో సంతవలస ఎంపిపి పాఠశాల కోసం ఈ భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత పాఠశాలను ఎత్తివేయడంతో కొన్నేళ్లపాటు అంగన్వాడీ కేంద్రంగా ఉపయోగించుకున్నారు. ఆ తర్వాత అంగన్వాడి కేంద్రం కూడా అక్కడ నిర్వహణ కొనసాగించక పోవడంతో ప్రస్తుతం మరమ్మతుకు గురై శిథిలావస్థలో చేరుతుంది. సంతవలస గ్రామానికి సొంత అంగన్వాడి భవనం లేక ఒక ఇంట్లో ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ంతో పలు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఈ ప్రభుత్వ భవనానికి మరమ్మతులు చేసి, అంగన్వాడీ కేంద్రానికి అప్పగించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.



నిరుపయోగమై శిథిలమౌతున్న ప్రభుత్వ భవనం

మెనూ పక్కాగా అమలు చేయాలి

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు మెనూ పక్కాగా అమలు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం ఇర్లపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి ప్రభుత్వ ఆశ్రమం పాఠశాలలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు వేడివేడి ఆహార పదార్థాలు తయారు చేసి అందజేయాలన్నారు. ప్రతిరోజు కాచి చల్లార్చిన నీళు అందజేయాలని, లెసన్ ప్లాన్లు ప్రకారం ఒకటికి రెండుసార్లు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల పాఠాలు చెప్పాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాలు, గుడ్లు, కోడి మాంసం, కాయగూరలు, నిత్యవసర సరుకులు వందర్లు ఏ విధంగా సరఫరా చేస్తున్నదీ ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే ఆసుపత్రులకు తీసుకువెళ్లి వైద్య చేయించాలని సూచించారు. అనంతరం తామరపల్లి, నూనెపల్లి, మీదుగా కొండపల్లి మారుమూల గ్రామానికి రహదారి ఏర్పాటు చేసే విధంగా ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఎన్ని కిలోమీటర్లు ఉన్నది, ఎక్కడెక్కడ వంతెనలు, కల్వర్టులు ఏర్పాటు చేయవలసి ఉన్నది నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

ఆశ్రమ ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు వద్దు

- గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఆదేశాలను ఉపసంహరించాలి
- పాడేరు ఐటిడిఎ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన



నిరసనలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు :ఆశ్రమ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారాన్ని రద్దు చేయాలని, గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఆదేశాలు ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఐటిడిఎ వద్ద యుటిఎఫ్ పిలుపుమేరకు యూనియన్ జిల్లా డివిజన్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు మాట్లాడుతూ బోధనేతర పనులన్నింటికీ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉపాధ్యాయులకు బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఈనెల 18న గిరిజన సంక్షేమ డైరెక్టర్ నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు రాత్రి 9 గంటల నుండి 12 గంటల వరకు విధులు నిర్వహించాలని, అలాగే ఉదయం 6 గంటలకు తప్పనిసరిగా ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని ఆదేశించారని, అలాగే మూడో వంతు ఉపాధ్యాయులు రాత్రి పూట బస చేయాలని ఆదేశించడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యానికి సైతం ఉపాధ్యాయులని ఏకపక్షంగా బాధ్యుల్ని చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు టి.చిట్టిబాబు, జిల్లా కార్యదర్శులు ఎం.ధర్మారావు, పి. దేముడు, ఎస్. కన్నయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.రఘునాథ్, చీకటి నాగేశ్వరరావు, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యం. శ్రీను,ఎస్ గంగాధర్, ఎల్ చంద్రశేఖర్ రాంబాబు, కాకరి రాజారావు ఎస్ బాలకృష్ణ, సీసా గోపి సభ్యులు పాల్గొన్నారు.

50 మంది విద్యార్థులకు ఒకరే టీచర్

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయితీ పెద్ద గంగవరం ఎంపీపీ స్కూల్లో ఒకటి నుంచి ఐదు తరగతులు వరకు 50 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, ఒకరే ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతో ఉపాధ్యాయురాలు వి.సుజన కుమారి విద్యా బోధనకు, పిల్లలను కంట్రోల్ చేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 మంది విద్యార్థులు దాటితే మరో ఉపాధ్యాయుని నియమించవలసి ఉంది. అయితే ఈ పాఠశాలలో ఒకరే టీచర్ ఉండడంతో స్కూల్ నడపడం కష్టంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయురాలి మాట వినకుండా స్కూలు బయట తిరుగుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. మరో ఉపాధ్యాయురాలను శాశ్వతంగా గాని, లేక డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పాఠశాల బయట ఆడుకుంటున్న పిల్లలు

నేడు రాజవొమ్మంగిలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, వాసంశెట్టి గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రాజవొమ్మంగి జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారని, మధ్యాహ్నం కార్యకర్తల సమావేశం జరుగుతుందని తెలిపారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు : మైత్రి మూవీ మేకర్స్, అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు వారి ఆధ్వర్యంలో జికె.వీధి మండలం సీలేరు రామాలయం జంక్షన్‌లో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీలేరు ఎస్సై యాసీన్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు పిహెచ్సి పరిధిలోని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్ట్, డెంటల్, కంటి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు విస్తృతం

- అంబులెన్స్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తృతం చేసేందుకు అధికారులతోపాటు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఎఎస్.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ తిరుమణి శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె. చిరంజీవి నాగవెంకట సాహిత్‌లతో కలిసి నూతన అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం విస్తృతంగా పనిచేస్తుందని, అధికారులందరూ సహకారం అందించాలని సూచించారు. డిసెంబర్‌లో జనరల్ బాడీ నిర్వహించి, పూర్తిస్థాయిలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎంఇఒలతో టీముగా ఏర్పాటు చేసి విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారుచేసేలా అన్ని మండలాల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహణ ద్వారా రక్తపు నిల్వలను పెంచేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలన్నారు.

కొత్తగా ప్రారంభించిన వాహనాన్ని పాడేరు డివిజన్ పరిధిలోవినియోగించుకోవాలని, పాత వాహనాన్ని చింతూరు ప్రాంతంలో అప్పగిస్తే చింతూరు, రంపచోడవరం ప్రాంతానికి పనిచేస్తుందన్నారు., చింతూరు ఐటిడిఎ పిఒఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెడ్ క్రాస్ సొసైటీని జిల్లాలో మరింత బలంగా పనిచేసేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ సేవల విస్తరణకు జిల్లా కలెక్టర్ చేస్తున్న కృషికి అధికారులంతా సహకారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఒక వాహనాన్ని కొనుగోలు చేసి విశాఖపట్నం కెజిహెచ్‌లోని ఎస్‌టి సెల్‌కు అప్పగించామని, గిరిజన రోగులు దాన్ని వినియోగించుకుంటున్నారన్నారు.

కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు, రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సూర్యారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తమర్బా ప్రసాద్ నాయుడు, సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్స్, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి అంబులెన్స్ ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి-ఎటపాక : తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల మంచి నీటి పైపులైను పలుచోట్ల ధ్వంసమయ్యాయని, రెండు సంవత్సరాలుగా వారిని పునరుద్ధరించకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి కాంట్రాక్టర్కు పలుమార్లు తెలిపిన సమస్య పరిష్కరించలేదన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించకుంటే జాతీయ రహదారి దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం మాజీ సర్పంచ్ రత్తమ్మ, సిపిఎం మండల కార్యదర్శి కాకా అర్జున్‌దొర, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, బుద్దుల భద్రయ్య, పూనెం వెంకటరావు, సవలం రాము, కారం జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, మహిళలు



రైతులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

గ్రామాల్లో 'రైతన్నా మీ కోసం'

ప్రజాశక్తి-గంగవరం : మండలంలోని ఎండపల్లి, మల్లేరు, మోహనాపురం పంచాయతీల్లో పిఎసిఎస్ చైర్మన్ పాము అర్జున్, టిడిపి మండల అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ తీగల ప్రభ అధ్యక్షతన రైతన్న మీకోసం కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకొచ్చేందుకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రజలందరూ అవగాహన చేసుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎండపల్లి రామలక్ష్మి, మాజీ జెడ్పిటిసి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సి సూరమ్మ, బూత్ కమిటీ కన్వీనర్ ముర్రం చిన్న నరసన్న దొర, రేవుల అబ్బాయి రెడ్డి, వీఆర్వో కుంజం వెంకటేశ్వర్లు, హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణ్ నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సరస్వతి, వెటర్నరీ అసిస్టెంట్ సూర్యకుమారి, ఏఎన్ఎం సరోజినీ పాల్గొన్నారు.

జీకే.వీధి : మండలంలోని సంకాడ గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి వాటిపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, బూత్ ఇన్చార్జి మామిడి చంటిబాబు, అగ్రికల్చరల్ అసిస్టెంట్, సాగిన కైలాసపతి, ఎం.చిన్ని, సంకాడ గ్రామ రైతులు పాల్గొన్నారు.


నేటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : పాడేరులో ఈ నెల 28న శుక్రవారం జరగనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీవిడి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు 10 కంపెనీల వారు జాబ్ మేళాకు వస్తున్నాయని, టెక్నికల్, నాన్ టెక్నికల్ చదివి నిరుద్యోగులుగా ఉన్న వారు ఈ కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలని సూచించారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

- డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్
- విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్‌కు రెండు రోజుల జీతం కట్
- సమయపాలన పాటించిన అటెండర్‌కు మందలింపు

ప్రజాశక్తి - అరకులోయ: వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్ సూచించారు. గురువారంఅరుకువేలి మండలం పరిధిలోని మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిహెచ్.సిలో రోగులకు సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి గ్రామాలలోప్రబలుతున్న రోగాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో హాజరు పట్టికను పరిశీలించి విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్ ఎస్. సింహాచలానికి రెండు రోజుల జీతంను నిలుపుదల చేయాలని ఆదేశించారు.విధి నిర్వహణలో సమయపాలన పాటించిన అటెండర్‌ను మందలించారు. పిహెచ్‌సిలో ప్రసవాలను ప్రోత్సాహించాలని, ఎక్కువగా సుఖ ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. గ్రామాల్లో ఆసుపత్రి ప్రసవాలు, చిన్నారులలో వచ్చే న్యుమోనియా వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహారంపై అవగాహన కలిపించాలన్నారు. కాన్పు అనంతరం 48 గంటలు సిబ్బంది పర్యవేక్షణలో తల్లీబిడ్డ ఉండాల, ఆరోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించిన అనంతరం తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనంలో వారిళ్లకు తరలించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. పిహెచ్‌సిలోని అన్ని విభాగాలను, వార్డులను, ప్రసూతి గదిని పరిశీలించారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలపై ఆరా తీసి, ఎన్ని మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి, వారికి అందించిన చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీని తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న మందులను వ్యాక్సిన్లను పరిశీలించారు. గ్రామాలలో ఇంటింటి సందర్శనలు నిర్వహించే క్షేత్రస్థాయి ఆరోగ్య, పర్యవేక్షణ సిబ్బంది అంకితభావంతో విధులను నిర్వర్తించాలని సూచించారు. విధినిర్వహణలో ఆలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.వసంత, సిబ్బంది పాల్గొన్నారు.



మాడగడ పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ




గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు, అధికారులు

సద్దుమణిగిన పాఠశాల ఏర్పాటు వివాదం

జెడ్‌పిటిసి గంగరాజు, అధికారుల చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని మారుమూల నాన్‌షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ, గాదిలోవ గ్రామంలో తలెత్తిన పాఠశాల ఏర్పాటు వివాదం స్థానిక సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎటిడబ్ల్యుఒ, మండల విద్యాశాఖ అధికారుల చొరవ, చర్చలతో పరిష్కారమై సద్దుమణిగింది. తమ గ్రామంలో అంటే తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలంటూ రెండు గ్రామాల తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి సర్దిచెప్పడం ద్వారా వివాదాన్ని కొలిక్కి తెచ్చారు.
గాదిలోవ పాఠశాలకు విద్యార్థులను పంపే విషయమై రెండు గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు మధ్య కొన్నాళ్లుగా వివాదం సాగుతోంది. ఎవరికి వారే తమ గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలన్న మొండిపట్టుదలతో వివాదాన్ని జటిలం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎటిడబ్ల్యుఒ వెంకటరమణ, ఎంఇఒ బాలాజీ గురువారం గ్రామాన్ని సందర్శించారు. రెండు గ్రామాల గిరిజనులతో సమావేశమయ్యారు. పాఠశాల ఏర్పాటు విషయమై చర్చించారు. చివరకు గాదిలోవ గ్రామంలోనే పాఠశాల నిర్మించేందుకు విద్యార్థులు తల్లిదండ్రులకు అంగీకరించారు. దీంతోవివాదం పరిష్కారమైంది.కార్యక్రమంలో మండల నాయకుడు జి దేవన్న, మాజీ ఎంపీటీసీ మేకల గంగులు శాఖ సిబ్బంది అచ్చిబాబు, బిఎస్ఎన్ పడాల్, సుబ్బారావు, గ్రామస్తులు దేవయ్య, గంగులు, ఎర్రయ్య, సన్యాసి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి కూర్చుని మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ శ్రీపూజ

మెరుగైన ఫలితాల సాధనకు కృషి

పాడేరు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ

ప్రజాశక్తి-హుకుంపేట: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనకు ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని పాడేరు ఐటిడిఎ పిఒ, ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగాకృషి చేయాలన్నారు.విద్యార్థులకు చదువుతోపాటు ఆసక్తిని బట్టి ఇతర రంగాల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. గురువారం మండలంలోని సూకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై సమగ్రపరిశీలన చేశారు. విద్యార్థులకు అందిస్తున్న వేడి తాగునీటిని, వంటగది పరిశుభ్రతను, స్టాక్ రూమ్‌ను, జిసిసి ద్వారా సరఫరా చేసిన సరుకులను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు హెల్త్ ఐడీ కార్డులు అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్నిపరిశీలించారు. అనంతరం సామాన్య శాస్త్రంలో పదవ తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షిస్తూ, వారి విద్యాస్థాయిపై అవగాహన పొందారు. తరగతి గదులు, వంటగది, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేరని అధికారులు తెలిపారు. పాఠశాల సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై బిఎల్‌ఒలకు అవగాహన

సిఇసితో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల ఆదేశాల మేరకు చేపట్టే అన్ని రకాల ప్రక్రియలు, అంశాలపై బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఒ)లకు సమగ్ర అవగాహనకు సంబంధిత ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు ద్వారా క్రమం తప్పకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ వివరించారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల ప్రధానాధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్, అల్లూరి జిల్లాలో చేపట్టే అంశాలను వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియలు, ఇతర అంశాలపై నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి అధికారులకు శిక్షణ సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. బిఎల్‌ఒలకు రెండు శిక్షణ పూర్తి చేశామన్నారు. దరఖాస్తులను పరిశీలించి తగినచర్యలు చేపడుతున్నామని, పెండింగ్ లేకుండా చూసుకుంటున్నామని సిఇఒ దృష్టికి తీసుకెళ్లారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాలోని పలు మండలాల అధికారులకు పలు అంశాలపై జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలు జారీచేశారు. రాబోయే అవసరాలను, జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే అందరూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. 2002 జాబితాను 2025 ఓటర్ల జాబితాతో సరిచూసి పరిశీలించాలన్నారు. జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటివరకు 28.14శాతం మాత్రమే జరిగింది. అరకు, పాడేరు నియోజకవర్గంలో 1200 దాటినా ఓటర్ల పోలింగ్ స్టేషన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

గుర్తించి, కొత్తగా 25 పోలింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేసి, వాటి పరిధిలో మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అంశాలన్నీ ఈ నెలాఖరులోగా సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు ప్రతిరోజూ ఒక గంట సమయం కేటాయించి, బిఎల్‌ఒలకు క్రమం తప్పకుండా సూచనలు ఇస్తూ అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బిఎల్‌ఒలు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, మ్యాపింగ్ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, ఆర్‌డిఒ ఎంవిఎస్. లోకేశ్వరరావు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

సింగపూర్ పర్యటనకు సత్యారావు

- విదేశీ విద్య అధ్యయనానికి ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునికి అరుదైన అవకాశం



చంద్రబాబు నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకుంటున్న సత్యారావు (ఫైల్)

ప్రజాశక్తి -హుకుంపేట :రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి విదేశాలకు పంపించి, అక్కడి విద్యా విధానాలు, బోధనా నైపుణ్యాల వినియోగంపై అధ్యయనం చేయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మత్స్యపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోస్య సత్యారావు ఎంపికయ్యారు. విద్యార్థులను తనదైన శైలిలో, వినూత్న పద్ధతులతో బోధిస్తూ సత్యారావు ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేస్తున్నారు. పాఠశాలలో ప్రవేశాలు పెరగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఎపిఆర్ పాఠశాలల్లో సీట్లు వచ్చేలా ప్రత్యేక తర్ఫీదు అందిస్తున్నారు. ఆయన చేసిన సేవలకు 2025 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా ఎంపికయ్యారు.
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విదేశీ విద్యా అధ్యయన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27 నుంచి డిసెంబర్ 2 వరకు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు.మోస్య సత్యారావు హుకుంపేట మండల ఏపిటీఎఫ్ మండల అధ్యక్షులుగా కూడా బాధ్యతలు నిర్వహిస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు అందిస్తున్నారు. విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, అందరితో మెలిసి, ఉదార స్వభావం కలిగిన మిత్రుడిగా మంచి గుర్తింపు పొందారు.

జూ పార్కులో జూనియర్ దళపతి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో జూనియర్ దళపతి (జూనియర్ హిప్పోపోటమస్) 8వ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఇ కాలేజీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు జూనియర్ దళపతి పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. కూరగాయలు, పండ్లతో అలంకరించిన ఆహారాన్ని జూనియర్ దళపతికి అందించారు.

పోడు పట్టాలకు సర్వే ప్రారంభం

ఆదివాసీ గిరిజన సంఘం వినతికి ఐటిడిఎ పిఒ స్పందన



గిరిజన గ్రామాల్లో సర్వే చేస్తున్న రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ కొర్రగుడ, కొంత్రయిగూడ, గుగ్గుడు, మెర్రిగూడ గ్రామాల్లో రైతులకు పోడు పట్టాలు మంజూరుకు గురువారం సర్వే ప్రారంభించారు. అర్హులైన గిరిజనులకు పోడు భూములకు సాగుహక్కు పట్టాలు ఇవ్వాలని ఇటీవల ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐటిడిఎ పిజిఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేసిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. గురువారం బస్కి పంచాయతీలోని గ్రామాలకు మండల సర్వేయర్‌ను పంపించి పోడు భూములపై సర్వేలు ప్రారంభించారు. తమ వినతికి స్పందించి సర్వే ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు తీసుకున్న చర్యలకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఇతర గ్రామాల్లో కూడా పోడు భూములకు పట్టాలు కావలసిన రైతులు అరకువేలి మండల ఆదివాసీ గిరిజన సంఘం నాయకులను సంప్రదించాలన్నారు కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు, బస్కి మాజీ ఎంపిటిసి బురిడీ దశరద్, ఆర్‌ఒఎఫ్ఆర్ మండల సర్వేయర్ కొర్ర బుద్ర, నాయకులు సమర్ది బాబూరావు పాల్గొన్నారు.

ఎపిఎఫ్‌డిసి ఎమ్‌డి శ్రీధర్‌తో భేటీ

కాఫీ కార్మికుల సమస్యలపై చర్చ



శ్రీధర్‌కు సమస్యలను విన్నవిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-చింతపల్లి: కాఫీ కార్మికుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని కాఫీ కార్మిక సంఘం సిఐటియు నేతలు కోరుతున్నారు. ఈ నెల 17న మంగళగిరిలో ఎపిఎఫ్‌డిసి ఎండీ ఎస్.ఎస్. శ్రీధర్‌నుకాఫీ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కలిసి కాఫీ కార్మికుల కష్టసమస్యలను వివరించారు.దీనిపై ఆయన స్పందిస్తూ కాఫీ తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కార్మికుల కష్టాలను పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో అప్పట్లో కాఫీ కార్మికులు తాత్కాలికంగా సమ్మెను విరమించి, విధుల్లో చేరారు. ఇచ్చిన మాట మేరకు ఎపిఎఫ్‌డిసి ఎండీ శ్రీధర్ రెండు రోజులుగా పాడేరు, చింతపల్లి, జికె.వీధి డివిజన్లలో పర్యటించి కాఫీ తోటలను పరిశీలిస్తున్నారు. తోటల నిర్వహణ, సంస్థ రక్షణ, కార్మికుల పని పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఇదే సమయంలో యాజమాన్యం కరువు భత్యం ఆధారంగా ఈ నెల 14 నుంచి కూలి వేతనాలు, పళ్ళు రేట్లను పెంచినట్లు ప్రకటించింది. రోజువారీ వేతనం రూ.321 నుంచి రూ.351కు పెరగగా, కాఫీ పండ్ల కేజీ రేటు రూ.6.10 నుంచి రూ.6.66కి పెరిగింది. కిలోకు 56 పైసలు, రోజుకు రూ.30పెంపు లభించింది. అయితే కార్మికులు మాత్రం కేజీ రేటు విధానానికి బదులుగా రోజువారీ వేతన విధానంపైనే పండ్ల సేకరణ చెల్లింపు ఉండాలని కోరుతున్నారు. సంస్థ రక్షణకుం ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం అత్యవసరమని, ప్రస్తుతం ఉన్న 17 ప్లాంటేషన్ కండక్టర్లు, 22 అసిస్టెంట్ కండక్టర్లతో తోటల నిర్వహణ అసాధ్యమన్నారు. ఆయా అంశాలపై శుక్రవారం చింతపల్లిలో ఎపిఎఫ్‌డిసి ఎండీ శ్రీధర్‌తో సమావేశం కానున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్. సుందరరావు తెలిపారు.

శీలంగొందిలో 'రైతన్నా.. మీకోసం'

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యాన శీలంగొందిలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి దన్నేరావు మాట్లాడుతూ రైతులు బాగుండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలతో రైతులకు ఆదుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములు కావాలని కోరారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



హేమంత్‌ను అభినందిస్తున్న పిఒ శ్రీపూజ

మాక్ అసెంబ్లీలో హేమంత్‌కు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-కొయ్యూరు : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న పాడేరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో కొయ్యూరు ఏపీఆర్ స్కూల్ పదో తరగతి విద్యార్థి సతివాడ హేమంత్‌సాయి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రథమ బహుమతి సాధించాడు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన హేమంత్ జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ చేతులమీదుగా ప్రశంసా పత్రం, మెడల్ అందుకున్నాడు. మండల స్థాయి, జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్న హేమంత్ సాయికి ప్రిన్సిపల్ ఎస్.నరసింహామూర్తి, వైస్ ప్రిన్సిపల్ శంకర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముఖ ఆధారిత హాజరు రద్దు చేయాలి

ప్రజాశక్తి-కూనవరం : ఉపాధి హామీ కూలీలకు రెండు పూటలా ముఖ ఆధారిత హాజరును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరారు. పశువుల తొట్ల నిర్మాణం ప్రభుత్వమే చేపట్టాలన్నారు. రైతే నిర్మాణం చేసుకోవాలని చెప్పడం సరికాదని, లక్ష రూపాయలు వెచ్చించి తొట్లను నిర్మించే శక్తి రైతులకు లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే మంజూరైన వాటిని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సర్పంచ్ నాగమణి, తెల్లం తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సాగునీటి పైపుల ధ్వంసం దారుణం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని శ్రీరామగిరి పంచాయితీ పరిధి శ్రీరామగిరి, చొక్కనపల్లి గ్రామాల్లో కొంత కాలంగా జరుగుతున్న భూ పోరాటాన్ని సహించలేని కొంతమంది గిరిజనేతరులు శ్రీరామగిరి ఆదివాసి రైతు ఆత్మకూరు కాంతారావు వ్యవసాయ ఇంజన్ గొట్టాలను ఉద్దేశపూర్వకంగానే గునపంతో పొడిచి పగలగొట్టడం సరికాదని భూ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ధ్వంసమైన గొట్టాలను శుక్రవారం పరిశీలించిన భూ పోరాట కమిటీ అధ్యక్షులు తోడం రాజు మాట్లాడుతూ స్థానిక ఆదివాసీలకు ప్రభుత్వ భూమిపై హక్కు ఉంటుందని తెలిపారు. తాము పోరాటం చేసేది స్థానికేతర గిరిజనేతరుల పైనే తప్ప స్థానిక గిరిజనేతరులపైన కాదని స్పష్టం చేశారు. స్థానిక గిరిజనేతరులు వారికి ఏమైనా కోపం ఉంటే చట్ట ప్రకారం చూసుకోవాలి తప్ప ఇలా ఎవరూ లేనప్పుడు వ్యవసాయ పనిముట్లను ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని హితవుపలికారు ఇలానే కొనసాగితే ఆదివాసీ సమాజం, భూ పోరాట కమిటీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి భూ పోరాట కమిటీ సభ్యులు మడివి సత్యనారాయణ, కారం రాము, ఎడ్ల సతీష్, చొక్కానపల్లి, మొద్దుల గూడెం భూ పోరాట కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాకు పోలవరం పేరు సరికాదు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు చేయనున్న జిల్లాకు పోలవరం పేరు సరికాదని భారత్ ఆదివాసీ పార్టీ రంపచోడవరం ఇన్‌చార్జ్ మద్దిటి అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా ఆదివాసీలు భారీ స్థాయిలో నివాసాలు, జీవనాధారాలు కోల్పోయారని, అయినా ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం అనే పేరు ఆదివాసీల నాశనానికి గుర్తు అని, అలాంటి పేరును రంపచోడవరం జిల్లాకు పెట్టడం ఆదివాసీల గుండెల్లో మరోసారి గాయం చేయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల భావాలను గౌరవించేలా ప్రభుత్వం పేరు నిర్ణయించాలని కోరారు

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై హైకోర్టు సుమోటోగా న్యాయవిచారణ చేపట్టాలని సిపిఐ జాతీయ సభ్యులు జెవి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ హత్యలు ప్రజా తిరుగుబాట్లను ఆపలేవని చరిత్ర రుజువు చేస్తోందన్నారు. ఎపిలో జరిగిన ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం విశాఖ నగరంలోని సరస్వతి పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, తెలుగు రాష్ట్రాలలో జల్, జంగిల్, జమీన్ కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీలను, వారికి అండగా నిలబడిన మావోయిస్టులను రాజ్యాంగానికి, ఉనికిలో ఉన్న క్రిమినల్ చట్టాలకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతున్నాయన్నారు. అడవుల్లోని సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లకు, పీసా చట్టానికి, అటవీ హక్కుల చట్టానికి, పర్యావరణ చట్టాలకు వ్యతిరేకంగా వందకు పైగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. సదరు ఒప్పందాల అమలుకు ఆటంకంగా ఉన్నారని ఆదివాసీలను, మావోయిస్టులను చట్ట విరుద్ధంగా చంపుతున్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా సహా పలువురిని ఇటీవల పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారన్నారు. ఇవి రాజ్యాంగ వ్యతిరేక రాజ్య హత్యలుగా జరిగాయని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌కు అర్బన్ ప్రాంతాల్లో ఆపరేషన్ సంభవ్‌గా మరో పేరు పెట్టి మరో 50 మందికి పైబడి వ్యక్తులను నిర్బంధించి రాష్ట్రంలోని విజయవాడ, ఏలూరు, కాకినాడ తదితర ప్రాంతాల్లో అరెస్టులు చేసి ప్రజాందోళన మేరకు కోర్టులో ప్రవేశపెట్టి



విశాఖ నగరంలో సాగుతున్న ర్యాలీ

జైలుకు పంపించారన్నారు. పౌర సమాజం మౌనం వీడి ప్రభుత్వం సాగిస్తున్న ఈ ప్రజా వ్యతిరేక అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తూ జరిగేటువంటి ప్రజా ఆందోళనలో పాల్గొనాలని, రాజ్యం ప్రజలపై అమలు చేస్తున్న రాజ్య హింసకు వ్యతిరేకంగా కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు అందరినీ ఉద్వేగానికి గురిచేశాయి. కంటతడి పెట్టించాయి. ఉత్తేజాన్నిచ్చాయి. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వై కొండయ్య, వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ సంఘాల నాయకులు గోవిందరాజులు, పట్నాయక్, ఎం.లక్ష్మి, టి.శ్రీరామమూర్తి, మహిత, న్యాయవాదులు కె.పద్మ, పల్లెటి అప్పారావు, చలం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల

దత్తతను ప్రోత్సహించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రత్యేక అవసరాల పిల్లల దత్తతను ప్రోత్సహించాలని కేంద్ర మహిళా. శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ మాలిక్ అన్నారు. 'ప్రత్యేక అవసరాల పిల్లల సంస్థాగతేతర పునరావాసం' అన్న అంశంపై సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కార), మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖలో గురువారం జాతీయ దత్తత అవగాహన సదస్సు - 2025 జరిగింది. నవంబర్ నెలలో జరిగే జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు శాశ్వత, ప్రేమతో కూడిన కుటుంబ ఆధారిత సంరక్షణ అందించడానికి వారి దత్తతను ప్రోత్సహించాలని వారంతా అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథి అనిల్ మాలిక్ మాట్లాడుతూ ప్రతి బిడ్డకు, ముఖ్యంగా ప్రత్యేక అవసరాలున్న వారికి సురక్షితమైన, శాశ్వత కుటుంబ వాతావరణం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. జువైనల్ జస్టిస్ చట్టం, దత్తత నిబంధనలకు అనుగుణంగా దత్తత సేవలను మెరుగుపరచడానికి రాష్ట్రాలు, ఏజెన్సీలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు .అనంతరం కార సభ్య కార్యదర్శి, సిఇఒ భావనా సక్సేనా మాట్లాడుతూ నైతిక, సమగ్ర, శిశు కేంద్రీకృత దత్తత వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కార చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సకాలంలో, పారదర్శక దత్తత ప్రక్రియల కోసం రాష్ట్ర దత్తత వనరుల సంస్థలు, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, బాలల సంక్షేమ కమిటీల మధ్య మరింత సమన్వయం ఉండాలని తెలిపారు. కార డైరెక్టర్ పుష్ప రావత్ పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న అనిల్ మాలిక్

దత్తత తీసుకున్న తల్లిదండ్రుల అనుభవాల కలబోత

సదస్సులో పాల్గొన్న వారు ప్రత్యేక అవసరాల పిల్లల దత్తత విషయంలో తమ అనుభవాలను పంచుకున్నారు. పలువురికి వారి మాటలు స్ఫూర్తినిచ్చాయి. సదస్సులో పాల్గొన్న 400 మందికిపైగా విధాన నిర్ణేతలు, నిపుణులు, దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పిల్లల దత్తత ప్రక్రియను బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ, ఒడిశా, ఉత్తరాఖండ్, చండీగఢ్ రాష్ట్రాల ప్రతినిధులు వైద్య పరీక్షలు, ఆర్థిక సహాయ వ్యవస్థలు, పిల్లలను ముందస్తుగా గుర్తించడం, చట్టపరమైన సౌలభ్యం కల్పించడం వంటి అంశాలపై ఉత్తమ పద్ధతులను పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా 'ప్రత్యేక అవసరాలున్న పిల్లల దత్తత' లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రం సామాజిక అపోహలను తొలగించి, దత్తతను ప్రోత్సహిస్తుందని అధికారులు తెలిపారు



మంచులోనే నడక సాగిస్తున్న యువకులు

పెరుగుతున్న చలి తీవ్రత

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో రోజురోజుకీ చలి తీవ్రత అధికమవుతుంది. చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చల్లటి గాలులు వీస్తున్నాయి. రాత్రి 8 గంటల నుంచి మంచు కురుస్తూ సీలేరు పరిసర ప్రాంతాలు అతి శీతలంగా మారుతుంది. దీంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామ గిరిజనులు చలి మంటలు వేసుకొని చలి నుంచి ఉపసమనం పొందుతున్నారు. తెల్లవారుజాము నుంచి 7 గంటల వరకు చలితో పాటు మంచు కురవడంతో వ్యాయామం చేసే యువకులు నానా ఆగచాట్లు పడుతున్నారు.

సిపిఎం నాయకుడు కృష్ణారెడ్డి మృతి



కృష్ణారెడ్డి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని జీడిగుప్ప పంచాయతీ పరిధి కొటారిగొమ్ము గ్రామానికి చెందిన వాళ్ల కృష్ణారెడ్డి పోలవరం నిర్వాసిత కాలనీలో రామగోపాలపురంలో గురువారం మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం మండల కమిటీ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన నాయకులు కృష్ణారెడ్డి అని పేర్కొన్నారు. తొలితరం కామ్రేడ్ అయిన ఆయన పట్టిన జెండా వదల కుండా తుది శ్వాస వరకు కొనసాగారన్నారు. భూ పోరాటం, కూలి పోరాటం, తునికాకు పోరాటం, పోలవరం వ్యతిరేక ఉద్యమం ఇలా అనేక ఉద్యమాల్లో క్రియాశీలపాత్ర పోషించారని కొనియాడారు. ఆయన స్వగ్రామం కొటారిగోమ్ము గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని కొండపల్లి గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ కె.సూరిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది అందరూ కలసి ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు చేతులు మీదుగా రూ.18వేలు ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె జగన్నాథం, మండల అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి గ్రామ శివారున ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజవొమ్మంగి గ్రామానికి చెందిన యువకుడు బి.అబ్దుల్ మహమ్మద్ అబ్దుల్ కరీం (19) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కరీం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

తాగునీటి బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జీకే.వీధి : మండలంలోని రింతాడ గ్రామంలో వర్మీ కంపోస్ట్ కేంద్రం వద్ద మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో తాగునీటి బోరు నిర్మాణానికి సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఎంపీపీ బి కుమారి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కంకిపాటి నారాయణ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మొట్టడం శరభన్న దొర, టిడిపి సీనియర్ నాయకులు సాగిన రంగారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.